


# ప్రాణం ఖరీదు

ఓట్ర ప్రకాశరావు

"విజయవాడకు ఒక టికెట్టివ్వండి" అన్నాను. నా చేతిలో డబ్బులు తీసుకోకుండా "సార్ ట్రైను బయలుదేరడానికి సిద్ధంగా వుంది. మీకు దొరకడం కష్టమనుకుంటాను" బుకింగ్ క్లర్క్ అన్నాడు.

"ఫరవాలేదు సార్, అర్జంటుగా వెళ్ళాలి. ప్రయత్నించి చూస్తాను టికెట్టు ఇవ్వండి" అన్నాను.

నా చేతిలో డబ్బులు తీసుకొని, టికెట్టుతో పాటు నాకు రావలసిన చిల్లర కలిపి ఇవ్వగానే అలాగే పాంటు జేబులో వేసుకొని వేగంగా ప్లాట్‌ఫారం వైపు పరుగెత్తసాగాను. నేను ప్లాట్‌ఫారం లోనికి ప్రవేశించేటప్పటికే ఎక్స్‌ప్రెస్ మెల్లగా బయలుదేర సాగింది. పరుగెత్తుకుంటూ వెళ్ళి ప్లాట్‌ఫారం దాటుతున్న చివరి కంపార్టుమెంటు కమ్మీ పట్టుకొని ఎక్కి గట్టిగా ఒక్కసారి ఊపిరి పీల్చుకొని వదిలాను.

లోపల తలుపు గడియవేసి ఉంది. అది లేడీస్ కంపార్టుమెంటు అని అప్పుడు గమనించాను.

సమయం సాయంత్రం ఆరు గంటలు కావస్తోంది. డిసెంబరు నెల కావడంతో సూర్యుని అస్తమయం వల్ల సంధ్య చీకటి ఏర్పడింది. కుండపోతగా కురుస్తున్న వర్షం వల్ల నాలో చలి ప్రారంభం అయింది. వర్షంలో తడుస్తూ, రెండు కంబీలను చేతులతో పట్టుకొని "ఏమండీ తలుపులు తెరవండి," అంటూ గట్టిగా అరిచాను. ఆడ ప్రయాణీకులు నన్ను చూస్తున్నారు తప్ప, ఎవరూ తలుపులు తెరవలేదు. ఒకరినొకరు నన్ను చూస్తూ నా గురించి మాట్లాడుకోవడం గమనించాను.

ఒక వయసు మళ్ళిన ఆవిడ నా దగ్గరకువచ్చి "చూడు బాబూ! అందరం ఆడవారం. నీవు దొంగవేమోన్న అనుమానం కలుగుతోంది. బండి స్టేషన్‌వందు బయలుదేరడానికి ముందు తలుపులు తెరవవద్దని టి.సి. హెచ్చరించి వెళ్ళారు" అంది.

"విజయవాడలో మా బామ్మ చనిపోయింది. ఫోను కబురందగానే బయలుదేరాను. వర్షాలవల్ల వంతెన తెగి బస్సులు రద్దయ్యాయి. ఈ ట్రైను వదిలితే మా బామ్మ ఆఖరి చూపు కూడా నోచుకోలేను. అందుకని పరుగెత్తుకుంటూ వచ్చి ఇలా ఎక్కాను" అన్నాను.

ఆవిడ నా మాటలు విని లోనికి వెళ్ళి మరి కాస్సేపటికి నా దగ్గరకు వచ్చి "నువ్వు చెప్పిన విషయం ఇక్కడ ఆడవారు నమ్మడం లేదు. తలుపులు తీయడానికి ఎవరూ అంగీకరించడం లేదు" అని బాధగా నా వైపు చూస్తూ చెప్పింది.

"నిజంగానే మా బామ్మ..."

"చూడు బాబూ! నీమాటలు నేను మాత్రం

# ఆకట్టుకునే విధంగా మాట్లాడటం ఎలా?

ప్రతి ఒక్కరూ ఆకర్షణీయంగా సంభాషించాలని, ఇతరుల దృష్టిని ఆకర్షించాలని అభిలషిస్తుంటారు. సంభాషణా చాతుర్యాన్ని అలవరచుకోవాలనుకొనేవారికి, ఇతరులను ఆకట్టుకునేవిధంగా మాట్లాడటానికి మనోవైజ్ఞానికులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

* మీరు మాట్లాడటం పట్లే కాదు ఎదుటివారు చెప్పేవి వినడం పట్ల కూడా పూర్తి శ్రద్ధాశక్తులను కనపరచాలి. ఎదుటివారు ఏ విషయం గురించయినా చెబుతున్నప్పుడు అది మీకు విసుగు కలిగించ వచ్చు. అయినా వారిని మధ్యలో ఆపి వేరేదో చెప్పడానికి ప్రయత్నించకండి.

* కంగారుగా మాట్లాడవద్దు. ఎంతటి ఉద్రేకపూరితమైన విషయాన్నయినా ప్రశాంతంగా చెప్పడాన్ని అలవర్చుకోండి.

* ఎదుటివారు కొత్తవిషయాలు, మీకు తెలియని విషయాలు ప్రస్తావిస్తున్నారేమో గమనించండి.

* మీకు ఇంతకు ముందు యాసగా మాట్లాడటం, ఊతపదాలు వాడటం అలవాటుంటే ఈ అలవాటును క్రమంగా తగ్గించుకోవడానికి ప్రయత్నించండి.

* ఎదుటివారు ఇష్టపడని అంశాలను ప్రస్తావించవద్దు. ఎదుటివారికి అర్థంకాని విషయాలను మాట్లాడవద్దు. మీరేం చెప్పదలచుకున్నారో స్పష్టంగా అర్థం అయ్యేట్లుగా వివరించండి.

* ఎదుటివారు బాధపడే అంశమేదో మీరు వెంటనే గుర్తించగలిగితే మీ సంభాషణను మరో విషయంపైకి మళ్ళించండి. అన్ని విషయాలను ముందుగానే ఆలోచించకుండా వాదనలోకి దిగవద్దు. ఉద్రేకంలో ఏదో ఒక వ్యాఖ్యానం చేయాలని ప్రయత్నించవద్దు.

* ఇతరుల అభిరుచులను, వారి ప్రవర్తనను మరింత నిశితంగా పరిశీలించండి. మీరు కొంతసేపు మాట్లాడిన తరువాత ఎదుటివారు మాట్లాడటానికి సైతం అవకాశం కల్పించండి.

* ఇతరులకంటే ఎక్కువ విషయాలు తెలుసునన్న ప్రదర్శనకు పూనుకోవద్దు. ఎదుటివారు ఏదయినా విషయం తప్పుగా చెబితే పరిహాసపూర్వకంగా నవ్వి, మీ ఆధిక్యతను వ్యక్తం చేయాలనుకోవద్దు.



* ఎదుటివారిలో ఆసక్తిని పురికొల్పే అంశాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ అవకాశం తలెత్తినప్పుడు వాటిని ప్రస్తావించండి.

* మీరు గంటల తరబడి ప్రసంగించవద్దు. క్లుప్తంగా మాట్లాడడానికి ప్రయత్నించండి. ఎదుటివారి పట్ల నిజమైన శ్రద్ధను, ఆసక్తిని కనబరచండి. ఇక అప్పై అందరూ మీరంటే ఇష్టపడతారు.

– మామిడి మహేంద్ర

నమ్ముతున్నాను. కానీ ఇక్కడివారు..." ఆ తరువాత చెప్పడానికి ఇష్టంలేక వెనక్కు తిరిగి లోనికెళ్ళింది.

కిటికీ దగ్గరకు సుమారు పాతిక సంవత్సరాల వయసు గల స్త్రీ వచ్చింది. "మీరీ వర్షంలో ఎక్కువ సమయం అలాగే ఉండలేరు. ఈ ట్రైన్ నిలబడడానికి రావలసిన స్టేషనుకు ఇంకా నలభై ఐదు నిముషాలు పైననే అవుతుంది. అందుకే మిమ్మల్ని కాపాడదలచుకున్నాను" అంది.

"చాలా థాంక్సండీ" అన్నాను కృతజ్ఞతగా ఆమె వైపు చూస్తూ.

"మీ దగ్గర డబ్బెంత వుంది" అని అడిగింది.

నా ప్రాణానికి డబ్బుతో ఖరీదు కడుతున్న ఆ అందమైన యువతి.. కాదు అది ఒక రాక్షసి.. అంత చలిలోనూ నాలో కోపాగ్ని భగ్గుమంది. 'దీనికన్నా ఆ ఆడవారే నయం' అని అనుకొని లోలోన దాన్ని కసితీరా తిట్టుకుంటూ తల తిప్పుకున్నాను. మరి కాస్సేపటికి ఆమె వెళ్ళిపోయింది.

ఎవరెవరో ఆడవారు వస్తున్నారు. పోతున్నారు. ఏదో జంతువును చూసినట్లు నన్ను చూసి వెళుతున్నారు. కనీసం దగ్గరకు వచ్చి పలుకరించడానికి కూడా భయపడటం గమనించాను.

బండి వేగం పుంజుకుంది. వర్షంతో పాటు చలిగాలి ఎక్కువ కాసాగింది. శరీరం ఎక్కువగా వణకడం ప్రారంభించింది. చేతులు పట్టు తప్పిపోతాయన్న భయం, ఆందోళన కలిగింది.

ఆ రాక్షసి మరలా వచ్చింది. "చూడండీ మీలో వణుకుడు ఎక్కువయింది. మీ ప్రాణం మీద మీకు ఏమాత్రం శ్రద్ధ వున్నా మీ దగ్గర డబ్బు ఎంత ఉందో చెప్పండి" అంది.

"ఆరు వందలు.. తెరవండి మీకిస్తాను.. ప్లీజ్" చలికి వణుకుతూ అన్నాను.

"ముందు ఆరు వందలు నా చేతిలో పెట్టండి," అంది. వస్తున్న కోపాన్ని బలవంతంగా దిగమింగుకొని జేబులోని ఆరు వందల రూపాయలూ దెయ్యం చేతిలో పెట్టాను.

ఆ డబ్బు తీసుకొని తలుపులు తెరవకుండా లోనికి వెళ్ళడంతో ఒక్కసారి నాలో విపరీతమైన నీరసం ప్రవేశించసాగింది. ఈ గాలి, వర్షంలో ఇంక నేను నిలబడలేను. నా చేతి పట్టు జారిపోతోంది. ఛ.. చివరిక్షణంలో నన్ను మోసం చేసిన దానిపై ఆలోచన మళ్ళింది.

అంతలో ట్రైన్ వేగం తగ్గింది. చలిగాలి వేగం తగ్గడంతో చేతులతో కమ్మీలను ఈసారి గట్టిగా పట్టుకున్నాను.

ఆ దెయ్యం మరలా నా దగ్గరకొచ్చింది. "ట్రైన్ గొలుసు లాగి వస్తున్నాను. ఇంకాస్సేపటిలో బండి నిలబడుతుంది. మీరు దిగి వేరొక కంపార్టుమెంటులో ఎక్కండి. గార్డు వచ్చి అడిగితే నేను గొలుసు లాగిన విషయం చెబుతాను. గొలుసు లాగినందుకు శిక్షగా డబ్బు కట్టమని అడుగుతారేమోనన్న అనుమానంతో ముందు జాగ్రత్తగా మీ దగ్గర డబ్బు తీసుకున్నాను. ఒకవేళ గార్డు జరిమానా గురించి ప్రస్తావించనట్లయితే తరువాత స్టేషనులో నన్ను కలవండి. మీ ఆరు వందలు మీకు ఇస్తాను. మీకు ఆపద కలగకుండా కాపాడటానికి నాకు ఇంతకు మించిన మార్గం వేరే దొరకలేదు," అని చెప్పింది.

తొందరపడి లోలోపల ఎన్నో విధాల తిట్టుకున్నా ఆ యువతికి మనసులోనే క్షమాపణ చెప్పుకున్నాను. నన్ను కాపాడిన ఆ దేవత వైపు కృతజ్ఞతగా చూశాను. *

## పసుపు రాసుకోవటం ఆరోగ్యకరం

మన హిందూ సాంప్రదాయంలో స్త్రీలు కాళ్ళకు, ముఖానికీ పసుపు రాసుకోవడం మన సాంప్రదాయం, ఆచారం. అది అలంకారంగాను, ఆరోగ్యసూత్రంగాను ఉపయోగపడుతుంది. ఎలాగంటే స్త్రీల పాదాలు సున్నితమైనవి. వారు ఇంటి పనులు చేసేటప్పుడు ఎక్కువ కాలం నీటిలో తడుస్తారు. కనుక సూక్ష్మక్రిములు చేరవచ్చు. అందుకే కాళ్ళకు పసుపు రాసుకుంటే పసుపు సూక్ష్మక్రిములను సంహరించి ఆరోగ్యం కాపాడుతుంది.

– విశ్వసాయి రాజారావు